VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

గురువారం 09 మే 2024

సంపుటి.01 సంచిక.294





# 166.. 58 బంతుల్లో ఉఫ్

**47 నిమిషాలు.. 58 బంతులు.. 167 పరుగులు.. 0 వికెట్లు! బుధవారం ఉప్పల్ స్టేడియంలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో సన్‌రైజర్స్ బ్యాటింగ్ విధ్వంసమిది. ఇన్నింగ్స్ విరామంలో అభిమానులు స్నాక్స్ తెచ్చుకునేలోపే.. టీవీ సెట్ల ముందున్న ప్రేక్షకులు కాస్త బ్రేక్ తీసుకునేలోపే సన్‌రైజర్స్ లక్ష్య ఛేదన పూర్తయింది.**

**ఉప్పల్‌లో రెచ్చిపోయిన హెడ్, అభిషేక్**

**సన్‌రైజర్స్ రికార్డు ఛేదన**

**లక్నో... చిత్తు చిత్తు.**

హైదరాబాద్:47 నిమిషాలు.. 58 బంతులు.. 167 పరుగులు.. 0 వికెట్లు! బుధవారం ఉప్పల్ స్టేడియంలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో సన్‌రైజర్స్ బ్యాటింగ్ విధ్వంసమిది. ఇన్నింగ్స్ విరామంలో అభిమానులు స్నాక్స్ తెచ్చుకునేలోపే.. టీవీ సెట్ల ముందున్న ప్రేక్షకులు కాస్త బ్రేక్ తీసుకునేలోపే సన్‌రైజర్స్ లక్ష్య ఛేదన పూర్తయింది. ఏదో విమానం మిస్ అవుతున్నట్లు.. ఈ బంతి పోతే మళ్లీ మరో బంతి దొరకదన్నట్లు.. కొట్టుడే కొట్టుడు! సన్‌రైజర్స్ ఓపెనర్లు అభిషేక్ శర్మ (75 నాటౌట్‌బీ 28 బంతుల్లో 8ఐ4, 6ఐ6), ట్రావిస్ హెడ్ (89 నాటౌట్‌బీ 30 బంతుల్లో 8ఐ4, 8ఐ6) ఉప్పెనలా విరుచుకుపడ్డ వేళ.. ఉప్పల్ స్టేడియాన్ని పరుగుల వరద ముంచెత్తింది. ఒకరిని మించి మరొకరన్నట్లు.. నువ్వా నేనా అని పోటీ పడుతూ ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ సాగించిన విధ్వంసం అసామాన్యం!



# ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లలో కోతకు కాంగ్రెస్ కుట్ర

- ఎన్నికల ప్రచారంలో వేగం పెంచిన మోడీ
- తెలంగాణలో సుడిగాలి పర్యటనలు
- వేములవాడ, హన్మకొండ సభల్లో ప్రచారం
- మతపరంగా ముస్లింలకు కోటా ఇచ్చేలా వ్యూహం
- రాజ్యాంగపరంగా దక్కిన రిజర్వేషన్లపై కాంగ్రెస్ కన్ను
- అయోధ్యలో రామాలయ తీర్పును సమీక్షిస్తే ఊరుకుందామా?
- ఆదానీ,అంబానీలపై నోరు మడతేసిన కాంగ్రెస్
- కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలపై ఘాటు విమర్శలు
- డబుల్ ఆర్ టాక్స్‌కు చరమగీతం పాడుదామని పిలుపు

**వేములవాడ/హన్మకొండ:** రాష్ట్రంలో మరో రెండుమూడు రోజుల్లో ఎన్నికల ప్రచారానికి తెరపడనుంది. ఈ క్రమంలో 400 సీట్ల టార్గెట్‌లో భాగంగా తెలంగాణలో అత్యధిక ఎంపి సీట్లు గెలవడమే లక్ష్యంగా బిజెపి ప్రచారం ఉధృతం చేసింది. ఇందులో భాగంగా ప్రధాని మోడీ తెలంగాణలో సుడిగాలి ప్రచారం చేపట్టారు. మంగళవారమే హైదరాబాద్ చేరుకున్న ప్రధాని మోడీ గురువారం ఉదయం వేములవాడ, హన్మకొండల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బిఆర్ఎస్‌లపై విమర్శల దాడి పెంచారు. రిజర్వేషన్లు రద్దు చేస్తామని తమపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను తోసిపుచ్చారు. అంతేగాకుండా కాంగ్రెస్ రిజర్వేషన్లపై కుట్రలు చేస్తోందని ప్రజలను హెచ్చరించారు. ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లలో కోత పెట్టి ముస్లింలకు ఇవ్వాలని చూస్తోందని, ఈ విషయంలో ఈ వర్గాలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక చేశారు. ఇలాంటి రిజర్వేషన్లు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మతపరమైన రిజర్వేషన్లకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను లాక్కుని ముస్లింలకు ఇచ్చేందు కు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ తీరుతో ఓబీసీలకు నష్టం జరుగుతుందన్నారు. మాదిగలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి కాంగ్రెస్ అడ్డుపడుతోందన్నారు. మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణకు కట్టబడి ఉన్నామని అన్నారు. ఇకపోతే అయోధ్యలో భవ్యరామమందిరం నిర్మాణం చేపట్టామని, దీనిని కాంగ్రెస్ బహిష్కరించిందని అన్నారు. రామాలయానికి తెలంగాణ నుంచే ద్వారం అందిందని గుర్తించారు. అయితే అయోధ్య కేసును తిరగ దోడాలని కూడా చూస్తోందని అన్నారు. ఇది నకెంత అవమానమో గుర్తించాలని ప్రజలను మోడీ కోరారు. ఇది మీకు సమ్మతమేనా అని ప్రశ్నించారు. అలాగే ఇంతకాలం ఆదానీ, అంబానీల జపం చేసిన కాంగ్రెస్ ఎన్నికలు రాగానే వారిగురించి మాట్లాడడం లేదని, వారి నుంచి ఎంత ముట్టచెప్పుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకపోతే రాష్ట్రంలో డబుల్ ఆర్ ట్యాక్స్ పేరుతో ప్రజలను దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఇక్కడున్న ఒక ఆర్.. ట్యాక్స్ వసూలు చేసి, ఢిల్లీలో ఉన్న మరో ఆర్ కు కప్పం కడుతోందని ప్రధాని మోదీ అన్నారు. వేములవాడ రాజన్న సన్నిధిలో జరిగిన సభలో మోదీ నిప్పులు చెరిగారు. బీజేపీ వేములవాడ సభలో కాంగ్రెస్, బిఆర్ఎస్‌పై ప్రధాని మోదీ చెలరేగిపోయారు. తెలంగాణ గట్టు మీద తమ ప్రత్యర్థులిద్దరూ ఒక్కటేనని చాటడానికి ఉదాహరణలు, పంచ్‌లతో ప్రధాని మోదీ తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు.

# అరచేతిలో వైకుంఠం

## చూపి మోసం చేసిన కాంగ్రెస్



**మెదక్:** అరచేతిలో వైకుంఠం చూపించి.. మనల్ని మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శలు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని తెలిపారు. రైతులను, యువకులను.. అందర్నీ కాంగ్రెస్ పార్టీ వంచించిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చిందని.. ఒక్క ఉచిత బస్సు మినహా ఏది కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. గత 15 రోజులుగా దిగ్విజయంగా కొనసాగుతున్న కేసీఆర్ బస్సు యాత్ర బుధవారం నాడు మెదక్ పార్లమెంటు పరిధిలోని నర్సాపూర్ చేరుకుంది. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. ఐదు నెలల్లోనే రాష్ట్రం ఇంత ఆగమాగం ఎందుకయ్యిందని ప్రశ్నించారు. రైతుబంధు కూడా రేపు రేపు వ్యవసాయం చేసినోళ్లకే ఇస్తారంట.. పొలం దున్నినోళ్లకే ఇస్తారంట అని కేసీఆర్ అన్నారు. ఇంతకుముందు అట్ల వచ్చిందా? ఇంతకుముందు అందరికి వచ్చింది కదా? అని ప్రశ్నినంచారు. రైతుబంధు నాట్లు వేసేటప్పుడు ఇయ్యాలి.. కానీ కోతలు అయినయ్.. కల్లాలు అయినయ్ ఇప్పుడు రైతుబంధు వేస్తామని అంటారు. ఇంతకంటే జోక్ ఏమైనా ఉంటదా? అని అడిగారు. తల, తోక లేకుండా ఈ ప్రభుత్వం అనేక రకాలుగా తెలంగాణను నష్టపరుస్తుందని మండిపడ్డారు. కరెంటు కోతల కారణంగా హైదరాబాద్‌లో పరిశ్రమలు వెళ్లిపోయే, ఐటీ దెబ్బతినే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీళ్ల కోసం కోమటిబండ నుంచి నర్సాపూర్‌కు ప్రత్యేక లైన్ వేయించినా.. కాళేశ్వరం ప్రాజెక్టుతో నర్సాపూర్ లింక్ కావాలని.. శంకరంపేట నుంచి కాల్వలు తవ్వుతున్నారు..

మిగతా 2లో

# వచ్చే పదేళ్లు సిఎంగా రేవంత్ రెడ్డి



- బిఆర్ఎస్ ఛాప్టర్ క్లోజ్ అయినట్లే
- పార్లమెంటులో ఒక్కసీటు కూడా రాదు
- మోడీ మరోమారు గెలిస్తే..
- ఇక నిరంకుశ పాలనే
- మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో
- మంత్రి కోమటిరెడ్డి

2లో

# క్రిశాంక్ బెయిల్ పిటిషన్ తీర్పు

**నేటికి వాయిదా వేసిన కోర్టు**

**అరెస్ట్ అక్రమమన్న కెటిఆర్**



2లో

# ప్రమాదవశాత్తు సిఎంగా రేవంత్ రెడ్డి

**అబద్దాల ప్రచారంతో విమర్శలు దారుణం**

**మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**



2లో



# ప్రమాదంలో... ప్రజాస్వామ్యం

2లో

**“బ్రిటిష్ కాలం నుంచి కొనసాగుతున్న జనాభా లెక్కల విధానాన్ని మోదీ నిలిపేశారు. కులగణన చేపట్టి బీసీలకు మేలు చేయడాన్ని అడ్డుకుంటున్నారు.**

**రిజర్వేషన్ల రద్దు, రాజ్యాంగాన్ని మార్చేందుకు మోదీ కుట్ర**

**ఆర్మూర్, నిజామాబాద్ రోడ్‌షోల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

# నేటి నుంచి ఇంటర్ ప్రవేశాలు

హైదరాబాద్: రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రవేశాల ప్రక్రియను ఈ నెల 9వ తేదీ (గురువారం) నుంచి ప్రారంభిస్తున్నట్లు ఇంటర్ విద్యామండలి కార్యదర్శి శ్రుతి ఓజా తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, మైనారిటీ, సహకార, గురుకుల, కేజీబీవీ, ఆర్‌జేసీ, మోడల్, కాంపొజిట్, ఒకేషనల్ తదితర జూనియర్ కళాశాలలన్నీ ఈ షెడ్యూల్‌ను పాటించాలని స్పష్టం చేశారు.

TELANGANA STATE BOARD OF INTERMEDIATE EDUCATION

విద్యా వినయేన శోభతే

HYDERABAD

ప్రైవేటు కళాశాలలు ప్రవేశాల కోసం ఎలాంటి పరీక్ష నిర్వహించరాదని, అలా నిర్వహించే కళాశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ప్రవేశాల కోసం ప్రకటనలు ఇస్తే వాటిపై పబ్లిక్ పరీక్షల (మాల్‌ప్రాక్టీస్, ఇతర అనైతిక చర్యల నిరోధక) నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కళాశాలల్లో విద్యార్థుల నమోదుపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని, కళాశాలల్లో బాలికల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ప్రమాదంలో ప్రజాస్వామ్యం

నిజామాబాద్: "బ్రిటిష్ కాలం నుంచి కొనసాగుతున్న జనాభా లెక్కల విధానాన్ని మోదీ నిలిపేశారు. కులగణన చేపట్టి బీసీలకు మేలు చేయడాన్ని అడ్డుకుంటున్నారు. రిజర్వేషన్లను రద్దు చేసేందుకు, రాజ్యాంగాన్ని మార్చేందుకే ఇలా కుట్ర పన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లు ప్రమాదంలో పడ్డాయి. నియంతృత్వ పాలనతో రాజ్యాంగాన్ని ఇష్టారాజ్యంగా మార్చుకుంటూ పోతే ప్రజాస్వామ్యం బతుకుతుందా? గతంలో ఎన్నడూ లేనివిధంగా దేశంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదం పొంచిఉంది. రాజ్యాంగం మారుస్తామని, రిజర్వేషన్లు రద్దు చేస్తామని అంటున్న భాజపాను గద్దెదించాలి. వాటిని కాపాడే బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటుంది" అని పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, నిజామాబాద్ నగరంలో నిర్వహించిన రోడ్ షోల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు.



**సిద్ధుల గుట్ట సాక్షిగా..**

"మాట ఇస్తే తలతెగి కింద పడ్డా వెనక్కితిరిగి చూడను. ఎన్ని కేసులు పెట్టినా తగ్గకుండా కొట్లాడాను. లక్షల మంది కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి పోరాడాను. ఇందిరమ్మ రాజ్యం తెచ్చాను. పసుపు పంటకు మద్దతు ధర, ఎర్రజొన్న, సోయా, మక్కలకు గిట్టుబాటు ధర, వరికి రూ.500 బోనస్ ఇచ్చే బాధ్యత నాది. ఆర్మూర్ సిద్ధులగుట్ట సాక్షిగా చెబుతున్నా.. ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాను. మే 9వ తేదీకల్లా రైతు భరోసా వేయకుంటే ముక్కు నేలకు రాస్తానని సవాలు విసిరా. 6వ తేదీ నాటికి 69 లక్షల మంది రైతుల ఖాతాల్లో డబ్బుల జమ చేయడం పూర్తయింది. కేసీఆర్ వచ్చి అమరవీరుల స్తూపం ముందు ముక్కు నేలకు రాయాలి. సవాల్ విసరడం కాదు.. స్వీకరించే ధైర్యం కూడా ఉండాలి. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేయకుంటే రాజీనామా చేయాలని హరీశ్‌రావు సవాల్ విసిరారు. తప్పక మాఫీ చేస్తా. ఆ రోజు దేశానికి స్వాతంత్ర్యంతో పాటు సిద్దిపేటకు హరీశ్‌రావు పీడ వదిలిస్తా.

**తెలంగాణకు మోదీ గాడిద గుడ్డు ఇచ్చారు..**

పదేళ్లు ప్రధానిగా ఉన్న మోదీ తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్ కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వాలని, చక్కెర కర్మాగారాలను తెరిపించాలని అడిగితే.. ఏమీ ఇవ్వలేదు. మళ్లీ వచ్చి అవే అబద్ధాలు చెబుతున్నారు. పసుపు బోర్డును ఐదేళ్లైనా ఏర్పాటు చేయలేదు. గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్‌ల విషయంలో అయితే ఇలా వాయిదా వేస్తారా? తెలంగాణ ప్రజలంటే లెక్కలేదా? వారిని మోసం చేయొచ్చని మోదీ, ధర్మపురి అర్వింద్ అనుకుంటున్నారు. మోదీ తెచ్చిన నల్ల చట్టాలను వ్యతిరేకించి.. మెడలు వంచి క్షమాపణ చెప్పించిన పౌరుషం హరియాణా, పంజాబ్ రైతులది. తెలంగాణలో ఆర్మూర్ ప్రాంత రైతులది ఇదే తరహా పౌరుషం. ఈ ఎన్నికల్లో భాజపాను ఓడించి బుద్ధిచెప్పాలి. మేము అధికారంలోకి వచ్చిన వెంటనే చక్కెర కర్మాగారం కోసం మంత్రులతో కమిటీ వేశాం. బ్యాంకు బకాయిలు తీర్చేందుకు రూ.43 కోట్లు విడుదల చేశాం. సెప్టెంబరులో తెరిపిస్తాం. వచ్చే ఏడాదిలో క్రషింగ్ మొదలుపెడతాం. పసుపు బోర్డు రావాలన్నా, చక్కెర కర్మాగారం తొందరగా తెరుచుకోవాలన్నా జీవన్‌రెడ్డిని గెలిపించండి.

**విగ్రహ ప్రతిష్ఠకు ముందే అక్షింతలెలా వచ్చాయి..**

భద్రాచలంలో అయినా, మరే ఇతర ఆలయంలోనైనా కల్యాణం అయ్యాకే అక్షింతలు ఇస్తారు. అయోధ్య విగ్రహ ప్రతిష్ఠ పూజ కంటే 15 రోజుల ముందే అక్షింతలు ఎలా వచ్చాయి? ఇది హిందువులను, దేవుడిని మోసం చేయడం కాదా? మేం హిందువులం కాదా.. పూజలు చేయడం లేదా? దేవుడి గురించి భాజపా వాళ్లు మనకు చెప్పాలా? దేవుడు గుడిలో ఉండాలి.. భక్తి గుండెల్లో ఉండాలి. వారే నిజమైన హిందువులు.

**కవిత బెయిల్ కోసం భారాస ఆత్మగౌరవం తాకట్టు..**

కేసీఆర్ తన బిడ్డ కవిత బెయిల్ కోసం భారాస ఆత్మగౌరవాన్ని మోదీ దగ్గర తాకట్టు పెట్టారు. దేశం కోసం త్యాగం చేసిన కాంగ్రెస్‌కు 40 సీట్లు వస్తాయని, భాజపాకు 400 సీట్లు వస్తాయని అంటున్నారు. ఈ మాటలతో ఆ రెండు పార్టీలు ఒకే నాణేనికి బొమ్మ, బొరుసు లాంటివని తేలిపోయింది. ఈ ఎన్నికల్లో భాజపా అభ్యర్థులను

గెలిపించేందుకు భారాస వాళ్లు లోపాయికారీ ఒప్పందం చేసుకున్నారు. మేం అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లో కొన్ని హామీలు అమలు చేశాం. ఉచిత బస్సు ప్రయాణాన్ని 40 కోట్ల మంది ఆడబిడ్డలు వినియోగించుకున్నారు. రూ.500కే సిలిండర్ అందిస్తున్నాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ

పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు నిర్ణయం తీసుకున్నాం. గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం మోపాం. ఇన్ని చేసిన నన్ను కేసీఆర్ దిగిపో అంటున్నారు" అని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. రోడ్‌షోలో కర్ణాటక మంత్రి బోసురాజు, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, కర్ణాటక ఎమ్మెల్యే మంత్ర గౌడ, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## క్రిశాంక్ బెయిల్ పిటిషన్ తీర్పు

**హైదరాబాద్:** బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు గురువారానికి వాయిదా పడింది. వాదోపవాదనలు విన్న తర్వాత తీర్పును ఈ నెల 9వ తేదీకిజడ్జి వాయిదా వేశారు. వాస్తవానికి ఈ కేసు విచారణను 7వ అదనపు చీఫ్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ విచారించాల్సి ఉండే. కానీ కేసును 21వ సెషన్ జడ్జికి బదిలీ చేశారు. గురువారం రోజు 21వ సెషన్ జడ్జినే విచారణ చేపట్టనున్నారు.షరతులతో బెయిల్ మంజూరు చేయాలని, నిందితుడికి ఐపీసీ సెక్షన్ 468 వర్తించదని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు నిన్న వెల్లడించారు. ఎలాంటి ఫోర్జరీ జరుగకుండానే ఐపీసీ సెక్షన్ 468ను పెట్టారని తెలిపారు. ఇటీవల అమిత్‌షా మార్ఫింగ్ వీడియో కేసులో కాంగ్రెస్ సోషల్‌మీడియా ప్రతినిధులపై నమోదైందని, వారిని అరెస్టు చేయరాదని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ ఉత్తర్వు ఈ కేసుకు కూడా వర్తిస్తుందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కీలకదశలో ఉన్న తరుణంలో బీఆర్ఎస్ సోషల్ మీడియాకు వెన్నెముకగా ఉన్న క్రిశాంక్ సేవలు ముఖ్యమని, బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరారు. నిరుడు ఓయూ ఇచ్చిన నోటీసు, ఇటీవల జారీచేసిన సెలవు నోటీసుకు మధ్య వ్యత్యాసం గురించి పోలీసులు విచారణ చేపట్టకుండా కేసును నమోదు చేశారని తెలిపారు. విద్యుత్తు, నీటి కొరత ఉన్నదన్న విషయాన్ని తప్పుపట్టడంలో అర్థంలేదని, రాజకీయాలను అడ్డంపెట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యర్థి పార్టీకి చెందిన వారిపై కేసులు నమోదు చేయిస్తున్నారని పేర్కొన్నారు. ఇదిలావుంటే భారాస నేత క్రిశాంక్ అరెస్టు అప్రజాస్వామికమని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం మెస్‌ల మూసివేతపై దుష్ప్రచారం చేసిన కేసులో చంచల్‌గూడ జైలులో ఉన్న క్రిశాంక్‌ను ఆయన కలిశారు. అనంతరం మాట్లాడుతూ.. క్రిశాంక్ చేసింది తప్పయితే తాను జైలుకు వెళ్తానన్నారు. సీఎం రేవంత్‌కు దమ్ముంటే ఆయన పెట్టిన సర్క్యులర్, తమ పార్టీ నేత పెట్టిన సర్క్యులర్ నిపుణుల ముందు పెట్టాలన్నారు. తప్పు చేసిన వారిని జైల్లో పెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తన భర్తపై తప్పుడు కేసు పెట్టారని క్రిశాంక్ భార్య సుహాసిని ఆరోపించారు. ఇలాంటి కేసులు ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఓయూ మెస్‌ల మూసివేతపై సర్క్యులర్‌ను మార్ఫింగ్ చేశారన్న అభియోగంపై ఈ నెల 1న క్రిశాంక్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

## వచ్చే పదేళ్లు సిఎంగా రేవంత్ రెడ్డి

**హైదరాబాద్:** వచ్చే పదేళ్లు తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డే ఉంటారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడమే గాకుండా, గత పాలకుల అవినీతిపైనా పోరాడుతుందని అన్నారు. ఎన్నికల తరవాత బిఆర్ఎస్ దుకాణం బంద్ అవుతుందనిఅ న్నారు. హైదరాబాద్ ప్రెస్÷-క్లబ్లో నిర్వహించాన మీట్ ది ప్రెస్‌లో కోమటిరెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. జూన్ 5 న 25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వస్తారన్నారు. బీఆర్ఎస్ దుకాణం ఖాళీ అవుతుందన్నారు. బీఆర్ఎస్ నుంచి నామినేషన్ వేసిన ఆరుగురు ఎంపీ అభ్యర్థులు కాంగ్రెస్‌లోకి వస్తామని తనను సంప్రదించారన్నారు. డీ లిమిటేషన్ తర్వాత తెలంగాణలో 154 సీట్లు అవుతాయన్నారు. 154 సీట్లలో 125 సీట్లు కాంగ్రెస్ గెలుస్తుందని కోమటిరెడ్డి తెలిపారు. కవితను చూస్తే చాలా నవ్వొస్తోందని అన్నారు. కవిత బతుకమ్మ చుట్టూ తిరుగుతుంది అనుకున్నామని.. కానీ బతుకమ్మలో బ్రాందీ బాటిల్ పెట్టుకొని తిరుగుతుందని మేం గుర్తించలేదని కోమటిరెడ్డి అన్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ కంటే శంకరమ్మకి తెలివి ఎక్కువ ఉందన్నారు. తలసాని మంత్రి ఎలా అవుతాడని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ని

ఫుట్ బాల్ ఆడుకుంటానన్న తలసాని మంత్రి అయ్యి గొర్రెలు, బర్రెలు, చేపలు తిన్నాడన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో క్యాంప్ పెట్టినప్పుడు మూడు రాత్రులు తాను కనీసం రూం నుంచి కాలు బయట పెట్టలేదన్నారు. కొందరు డిల్లీ వెళ్లి పైరవీలు చేసుకున్నారన్నారు. కానీ తాను మాత్రం ఎక్కడికీ వెళ్ళలేదని అన్నారు. కవిత వల్ల మన పరువు పోయిందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలువదన్నారు. జూన్ 4 తర్వాత తెలంగాణ భవన్ క్లోజ్ అవుతుందన్నారు. . కేసీఆర్ సచ్చిన పాములాంటోడన్నారు. కేసీఆర్ బస్సు యాత్రతో వచ్చేది లేదు.. సచ్చేది లేదని మంత్రి అన్నారు. ఈ ఎన్నికలు ఎంతో చాలా కీలకమన్నారు. రాముడి పేరు మీద బీజేపీ రాజకీయం చేస్తోందని విమర్శించారు. పదేండ్లు ప్రధానిగా ఉండి.. రాముడి పేరు చెప్పి ఓట్లు అడుక్కునే పరిస్థితి వచ్చిందని మోడీకి పట్టిందని ఎద్దేవా చేశారు. రిజర్వేషన్లపై మోదీ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ÷రైయ్యారు. ముస్లిం రిజర్వేషన్లు తొలగిస్తామని బీజేపీ నాయకులు మత కలహాలు రేపుతున్నారని మండిపడ్డారు. ఓట్ల కోసం బీజేపీ చిల్లర రాజకీయం చేస్తుందన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల ముచ్చట ఏమైందని ప్రశ్నించారు. జీఎస్టీ పేరుతో భారీ మోసం జరుగుతుందని చెప్పారు. అంబానీ, అదానీ చేతుల్లోనే దేశ సంపద ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 14 నుంచి 15 సీట్లు గెలుస్తుందని మంత్రి కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు. మూడోసారి మోదీ ప్రధాని అయితే దేశంలో ఇక ఎన్నికలు ఉండవన్నారు. మన దేశంలోనూ రష్యా, చైనా తరహా పాలన వస్తుందని సంచలన ఆరోపణలు చేశారు. రాజ్యాంగాన్ని మార్చి వాళ్లే పాలకులుగా ఉంటారని సంచలన వ్యాఖ్యలు చేశారు. 25 కోట్ల మంది ముస్లింల రిజర్వేషన్లు తీసేస్తామని ఎలా అంటారని బీజేపీకి కౌంటర్ వేశారు. వాళ్లంతా రోడ్ల మీదకు వస్తే ఏం జరుగుతుందో తెలుసా అని హెచ్చరించారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుందని విమర్శించారు. ఈ రాష్ట్రంలో కేసీఆర్ శకం ముగిసిపోయిందని.. తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మొత్తం 17 స్థానాలకుగానూ 14 సీట్లు గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ పార్టీ లక్ష్యం 15 స్థానాల్లో విజయం సాధించడమని, అయితే 14 స్థానాల్లో గెలుస్తామన్న నమ్మకం తమకు ఉందని తెలిపారు. జూన్ 5 తరువాత దేశంలో చాలా మార్పులు వస్తాయన్నారు.

# అరచేతిలో వైకుంఠం చూపి మోసం చేసిన కాంగ్రెస్



అభివృద్ధి చేసిందో మీ అందరికీ తెలుసని అన్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీకి 25 కోట్లు ఇచ్చిన.. వాటిని కూడా వాపస్ తీసుకెళ్తున్నారని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి డబ్బులు ఇచ్చినం.. వాటిని కూడా వాపస్ తీసుకెళ్తున్నారని చెప్పారు. కొల్చారం మండలంలో మల్లినాథ సూరి పేరు మీద యూనివర్సిటీని పెడదామని అనుకున్నాం.. దాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేసేలా లేదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు హల్దీవాగు మీద, మంజీరా నది మీద 10 చెక్‌డ్యామ్‌లు కట్టాం.. దాని ద్వారా పంటలు పండించుకున్నాం.. దాన్నంతా దెబ్బ తీసే పరిస్థితులు వస్తున్నాయని పేర్కొన్నారు. అంటే సాగు నీరు రాదు.. తాగునీరు రావు.. కరెంటు రాదు.. సంక్షేమం లేదు. ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని అన్నారు. ఈ ప్రభుత్వం ప్రతి దానికి ఏదో కొండి పెట్టడం, తొండి పెట్టడం, అబద్దాలు చెప్పడం చేస్తుందని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలవాలని, మెదక్ ఎంపి అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డిని మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎజెండాలో పేదల గోసలు, రైతుల బాధలుండవని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శించారు. నర్సాపూర్ రోడ్‌షోలో భాగంగా కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నరేంద్ర మోదీ పార్టీతో ఏమన్నా పైసా లాభమైనా ఉన్నదా? సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ ఏమైనా అయ్యిందా? మోదీ పాలనో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే రూ.84కి పడిపోయింది. ఏ ప్రధానమంత్రి కాలంలో దిగజారనంత దిగజారిపోయింది. పెట్టుబడులు పోయాయి. పరిశ్రమలు మూతపడ్డాయి. కార్మికులు రోడ్డునపడుతున్నరు. ఎల్ఐసీని ముంచే ప్రయత్నం చేస్తున్నరు. పబ్లిక్ సెక్టార్ అంతా ప్రైవేటీకరణ చేస్తున్నరు' అంటూ మండిపడ్డారు. మోదీ ఎజండాలో పేదల బాధలు, గోసలుండయ్. రైతుల బాధలుండవు. ఢిల్లీలో రైతులు ధర్నా చేస్తే.. 750 మంది రైతులను చంపిన వ్యక్తి నరేంద్ర మోదీ. మళ్లీ యూపీ ఎన్నికలు వస్తే సారీ చెప్పి.. మాఫీ చెప్పి వేడుకున్న వ్యక్తి మోదీ. ముఖ్యంగా యువకులు, విద్యా?ర్థులు, మేథావులు, ఆలోచనపరులతో నా మనవి. ఈ రాష్ట్రం, ఈ దేశం మనది. భవిష్యత్ మనది. దయచేసి ఆలోచించి ఓటు వేయండి. ఓ ఒరవడిలో కొట్టుకుపోయి ఓటు వేయడం కాదు. మనకు న్యాయం జరిగాలి. నర్సాపూర్‌లో లంబాడాలు ఎక్కువగా ఉన్నరు. నేను 58 సంవత్సరాలు మొత్తుకుంటే.. ఏ ముఖ్యమంత్రి లంబాడి తండాలను గ్రామ పంచాయతీలు చేయలేదు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిందే కేసీఆర్. మీకు డైరెక్ట్‌గా నిధులు పంపిందే కేసీఆర్. గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్లు పెట్టిందే కేసీఆర్. ఇవన్నీ ఉన్నయ్. టీఎస్‌పీఎస్సీలో గ్రూప్-1 పరీక్షలు జరుగుతున్నయ్. పరీక్షల సమయంలో హైకోర్టు ప్రభుత్వాన్ని అడిగింది. పదిశాతం రిజర్వేషన్లు విరుద్ధంగా ఉందని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం చాలా బలంగా వాదించాలి కదా? కొట్లాడాలి కదా? అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం రిపోర్ట్ తెప్పించి.. కమిటీ వేసి చేసిందాన్ని నిలబెట్టాలి కదా? ఇవాళ మనం లేము. వాళ్లు మాట్లాడే పరిస్థితుల్లో లేరు' అన్నారు. మన పదిశాతం రిజర్వేషన్ మనది మనకే ఉండాలన్నా.. పార్లమెంట్‌కి వెంకట్రామిరెడ్డి వెళ్లాలి. మన తరఫున వాదించాలి. గిరిజనులకు పోడు భూములు ఇచ్చాం. పోడు భూములకు రైతుబంధు పడ్డదా? బీఆర్ఎస్ ఉన్నప్పుడు వచ్చింది.. బీమా కూడా చేశాం. ఇప్పుడు రైతుబంధు ఎవరికీ లేదు. సమాజంలో ఏ ఒక్క వర్గం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేయడం లేదు. అందరం ఏకమై తెలంగాణను కాపాడుకోవాలి. కృష్ణా, గోదావరి నీళ్లను నరేంద్ర మోదీ తమిళనాడుకు తీసుకుపోతా అంటున్నడు. దాన్ని కాపాడాలన్నా.. తెలంగాణ ఆత్మగౌరవం కాపాడాలన్నా ఖచ్చితంగా బీఆర్ఎస్ ఎంపీలుంటేనే పార్లమెంట్‌లో పులిబిడ్డల్లా కొట్లాడుతరు. ఆ నాడు తెలంగాణ కోసం ఎలాగైతే కొట్లాడినమో.. అట్ల కొట్లాడుతరు. అలా హక్కులు ఉంటయ్. ఆల్రెడి నాకు రిపోర్ట్ ఉంది. వెంకట్రామిరెడ్డి తెలంగాణ మొత్తం మీదనే అతిఎక్కువ మెజారిటీతో గెలిస్తున్నడు మీ దీవెనలతోని. నర్సాపూర్ నియోజకవర్గం నుంచి కనీసం 40వేల-50వేల మెజారిటీని తీసుకురావాలని కోరుతున్నానన్నారు.

# తెలంగాణ కోసం కొట్లాడే పార్టీ బిఆర్ఎస్

### పార్లమెంటులో మనోళ్లు ఉంటేనే హక్కులు సాధిస్తాం

### మల్కాజిగిరిలో రాగిడిని భారీ మెజార్టీతో గెలిపించాలి

### ప్రచారంలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ పిలుపు

**మేడ్చెల్:**తెలంగాణ కోసం పేగులు తెగేదాకా కొట్లాడే ఒకే ఒక పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని కేసీఆర్ అన్నారు. పార్లమెంటులో మనోళ్లు డజను మంది ఉంటేనే కచ్చితంగా తెలంగాణ హక్కులు కాపాడతారు.. తెలంగాణకు నిధులు తెస్తారని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దిగ్విజయంగా కొనసాగుతున్న కేసీఆర్ బస్సు యాత్ర బుధవారం మల్కాజ్‌గిరి పార్లమెంటు పరిధిలోని దుండిగల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరిలో రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు.మల్కాజ్‌గిరి పార్లమెంటులో టైగర్‌లాంటి ఎమ్మెల్యేలు ఉన్నారని కేసీఆర్ అన్నారు. కుత్బుల్లాపూర్‌లో 85వేల ఓట్లతో గెలిచిన వివేకానంద ఉన్నాడు.. కూకట్‌పల్లిలో 70వేల ఓట్లతో గెలిచిన మాధవరం కృష్ణారావు ఉన్నారు.. ఇలా అసెంబ్లీ ఎన్నికల ప్రకారం చూస్తుంటే బీఆర్ఎస్‌కు దాదాపు 4 లక్షల మెజారిటీ వస్తుందని అన్నారు. రాగిడి లక్ష్మారెడ్డి చాలా మంచి వ్యక్తి, నిజాయతీపరుడు అని పేర్కొన్నారు. ఆయనకు రాజకీయాల్లో ఎప్పుడూ అవకాశం రాలేదు. ఫస్ట్ టైమ్ మనం టికెట్ ఇచ్చి నిలబెట్టుకున్నామని తెలిపారు. ' రాగిడి లక్ష్మారెడ్డి ఒక సంస్థ పెట్టి లక్షలాది మంది ప్రజలకు న్యాయం చేసిండు. వాటర్ ట్యాంకర్లు పెట్టి ప్రజలకు నీళ్లు సప్లై చేసిండు. పేదింటి బిడ్డల పెండ్లిళ్లు చేసిండు. లక్ష్మన్న అని పిలిస్తే నేనున్నా అంటూ కదిలొచ్చే మనిషి రాగిడి లక్ష్మారెడ్డి. '



అని పేర్కొన్నారు. సభ్యత, సంస్కారం ఉన్న వ్యక్తి రాగిడి లక్ష్మారెడ్డి అని అన్నారు. మల్కాజ్‌గిరిలో రాగిడి లక్ష్మారెడ్డి ఆల్రెడీ గెలిచిపోయిండు.. ఎలక్షన్ తేలిపోయిందని వ్యాఖ్యానించారు. వరుసపెట్టి చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, మెదక్, గెలుస్తున్నాం.. పార్లమెంటు ఎన్నికల్లో డజనుకు పైచిలుకు సీట్లు బీఆర్ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చేసిన మోసం ప్రజలకు అర్థమయ్యిందని తెలిపారు.

## ప్రమాదవశాత్తు సిఎంగా రేవంత్ రెడ్డి

హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి అబద్ధపు ప్రచారాలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రమాదవశాత్తూ రేవంత్ రెడ్డి సీఎం అయ్యారని సంచలన వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే బీజేపీపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అబద్దాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గాడిద గుడ్డు పెట్టదు కానీ రేవంత్ రెడ్డి పెట్టించారని విమర్శించారు. ప్రతి పబ్లిక్ మీటింగ్‌లో గాడిద గుడ్డుతో వస్తుంటే.. రేవంత్ రెడ్డి పార్టీ గాడిద గుడ్డు పార్టీయా? ఆయన గుర్తు గాడిద గుడ్డా? అని తెలంగాణ ప్రజలు అనుకుంటున్నారని సెటైర్ వేశారు. బీజేపీ రిజర్వేషన్లను తీసేస్తుందని జరుగుతున్న ప్రచారంపై కూడా కిషన్‌రెడ్డి స్పందించారు. రాజ్యాంగం ద్వారా అంబేడ్కర్ ఇచ్చిన రిజర్వేషన్లను ఎవరూ తొలగించలేరని స్పష్టం చేశారు. రిజర్వేషన్లను తొలగించబోమని ప్రధాని మోదీ కూడా చెప్పారని గుర్తు చేశారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలు చేస్తుందని ధ్వజమెత్తారు. బీజేపీని.. కురే కురే బీజేపీ అని మాజీ మంత్రి కేటీఆర్ చేసిన కామెంట్లపై కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు.

# పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా కృషి చేయాలి.

## - సెక్టోరల్ అధికారుల శిక్షణ తరగతుల్లో అబ్జర్వర్, కలెక్టర్.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మే 8**




ఈ నెల 13న కొనసాగనున్న పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా సెక్టోరల్ అధికారులు కృషి చేయాలని నిజామాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం ఎన్నికల సెక్టోరల్ అధికారులకు మలి విడత శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. శిక్షణ తరగతులకు ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ విచ్చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ ప్రక్రియకు సంబంధించి సెక్టోరల్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, పరిశీలించాల్సిన విషయాలపై అంశాల వారీగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా, ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని హితవు పలికారు. ఇదివరకు కూడా ఇవే బాధ్యతలను నిర్వర్తించాం కదా అనే భావనతో విధులను ఎంతమాత్రం తేలికగా తీసుకోకూడదని, ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని జాగ్రత్తలు సూచించారు. ఎవరైనా విధుల పట్ల అలసత్వాన్ని ప్రదర్శిస్తూ నిర్లక్ష్యానికి తావిస్తే, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటి సమాచారం అందించాలన్నారు. ముఖ్యంగా ఈ.వీ.ఎంల విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉంటూ అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, పక్కాగా నిబంధనలు పాటించాలని అన్నారు. పోలింగ్ కు ఒక రోజు ముందే ఉదయం ఆరు గంటలకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కు చేరుకొని, పోలింగ్ బృందంలోని అధికారులు, సిబ్బంది అందరూ హాజరయ్యారా లేదా అన్నది చూసుకోవాలని, పోలింగ్ నిర్వహణ కోసం అవసరమైన సామాగ్రిని సక్రమంగానే అందించారా అన్నది క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని తెలిపారు. అదనపు పోలింగ్ సామాగ్రిని తమ వద్ద అందుబాటులో ఉండేలా సెక్టోరల్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో అందించిన బ్యాలెట్ యూనిట్లు, వివి.ప్యాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవడం, చెక్ చేయడం వంటివి చేయకూడదని అన్నారు. పోలింగ్ రోజున ఉదయం 5.30 గంటలకు మాక్ పోల్ ప్రారంభం అయ్యేలా చూడాలని, ఏజెంట్లు రాని పక్షంలో 15 నిమిషాలు వేచి చూసి మాక్ పోల్ జరిపించాలని సూచించారు. మాక్ పోల్, పోలింగ్ ప్రక్రియల సందర్భంగా ఎక్కడైనా ఈవీఎంలలో సాంకేతిక సమస్య తలెత్తితే, సెక్టోరల్ అధికారులు వెంటనే స్పందించి తమ వద్ద రిజర్వ్ లో ఉంచిన యూనిట్లను సమకూర్చాలని సూచించారు. యూనిట్లు మార్చడానికి ముందు ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందాన్ని సంప్రదించి వారికి సమస్యను వివరించాలని అన్నారు. పోలింగ్ రోజున ఓటింగ్ శాతాన్ని వెంటదివెంట ఎన్ కోర్ యాప్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. 17-సి డాక్యుమెంట్, పీ.ఓ డైరీ, విజిట్ షీట్, మాక్ పోల్ సర్టిఫికేట్, 17 కాలమ్ ప్రొఫార్మా వంటివి తప్పులు లేకుండా సక్రమంగా పూరించేలా పరిశీలన జరపాలన్నారు. పోలింగ్ ముగిసిన మీదట ఈవీఎంలను జాగ్రత్తగా రిసెప్షన్ సెంటర్లకు చేర్చాలని, వాటిని సరిచూసుకుని స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపరిచే వరకు సెక్టోరల్ అధికారులు అక్కడే అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు.

సెక్టోరల్ ఆఫీసర్లు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ముందుగానే క్షేత్రస్థాయిలో సందర్శించి, మౌలిక వసతులను పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా వేసవి తీవ్రత దృష్ట్యా ప్రతి పీ.ఎస్ లో టెంట్లు సరిపడా వేశారా లేదా అన్నది గమనించాలని, ఓటర్లు క్యూలో నిల్చునే ప్రాంతమంతా కవర్ అయ్యేలా టెంట్ ఉండాలన్నారు. అదేవిధంగా తాగునీరు, టాయిలెట్, విద్యుత్ వసతి, ఫ్యాన్లు వంటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని హితవు పలికారు. పోలింగ్ నిర్వహణ కోసం అవసరమైన టేబుళ్లు, కుర్చీలు, ఇతర ఫర్నీచర్ సమకూర్చుకున్నారా అన్నది పరిశీలించాలని, ర్యాంపు సరిగా ఉండేలా, వీల్ చైర్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రంతో పాటు, పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయా అన్నది గమనించాలని, ఏవైనా లోటుపాట్లు ఉంటే అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సాకేత్, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ఆగండి కొంచెం ఆలోచించండి"



## - ఓటర్లను చైతన్య పరిచేందుకు కరపత్రం ఆవిష్కరణ.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మే 8:**




లోక్ సభ ఎన్నికల సందర్భంగా "ఆగండి కొంచెం ఆలోచించండి" అని ఓటర్లను చైతన్యం చేసే విధంగా కామారెడ్డి సిటిజన్స్ అసోసియేషన్, మహిళా వేదిక, జలసాధన సమితి, అధ్యయన వేదిక సంయుక్తంగా ప్రచురించిన కరపత్రాన్ని బుధవారం విడుదల చేశారు.పోటీ చేసే రాజకీయ పార్టీల మేనిఫెస్టోలు, గత కార్యాచరణ, పోటీదారుల చరిత్ర తెలుసుకొని, ప్రజలు నిర్దిష్టంగా ఆలోచించి, చర్చించి నిర్ణయించుకోవడం ప్రజాస్వామ్యం ! అయితే వాస్తవానికి మైకులు, ఊరేగింపులు, వాగ్దానాల వరదలు, బహిరంగ సభలు, తాయిలాలు, పథకాలు ,ప్రలోభాలు , ఉన్మాదాలు , విభజన వాదాలు , అరచేతిలో వైకుంఠాలు వాగ్దానాల వరదలో కొట్టుకు పోతున్న పార్టీస్వామ్యం లో దేశం ఎదుర్కొంటున్న సమస్యలు ప్రజల ఆర్థిక సమస్యలు చర్చకు రాకుండా ప్రజల భావోద్వేగాలను దృష్టిలో పెంచి ఓట్లు దండుకునే విధంగా నేటి ఎన్నికల ప్రచారం ఉంది ఈ పరిస్థితుల్లో ప్రజలు ఆలోచించి ఓటు చేయాలని కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి. జగన్నాథం, సిపిఐ సీనియర్ నాయకుడు వి.ఎల్.నర్సింహారెడ్డి, ఎపిటిఎఫ్ పూర్వ అధ్యక్షులు కె.వేణుగోపాల్, టిపిటిఎఫ్ పూర్వ అధ్యక్షులు కె.రమణ, కె.శ్రీనివాస్, పి.అంజయ్య, న్యాయవాదులు సంజీవరావు, ఎన్. శ్రీధర్ , నరేందర్, నాగభూషణం అన్నారు.

# పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలి.

## - జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మే 8**



భారత ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి ననుసరించి పోలింగ్ రోజు ముందు 48 గంటల నిశ్శబ్ద (సైలెన్స్ పీరియడ్ ) కాలం అత్యంత కీలకమని, అధికారులు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. ఈ మేరకు ఎన్నికల సంఘం స్టాండర్డ్ ఆపరేషనల్ ప్రొసిజర్ లో పేర్కొన్న విధంగా పోలింగ్ కు 72 గంటలు , 48 గంటల ముందు తు.చ తప్పక పాటించవలసిన నిబంధనలను వివరిస్తూ సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, ఆబ్కారీ, వాణిజ్య పన్నులు, ఆదాయ పన్ను అధికారులు, ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి టీములు, వ్యయ నియంత్ర అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నెల 13 న సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగియనుండగా, అంతకు ముందు 48 గంటల నుంచి ఎన్నిక ముగిసే వరకు ఎటువంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడం నిషేధమని, ఐదుగురికి మించి ఒకే చోట గుమికూడరాదన్నారు. ప్రచార సమయం ముగిసిన వెంటనే ఇతర నియోజక వర్గాలవారు వెళ్లిపోవాల్సి ఉంటుందన్నారు. కల్యాణ మండపాలు, మ్యారేజ్ హాళ్లు, కమ్యూనిటీ హాళ్లు, లాడ్జిలు, అతిథి గృహాలలో తదితర ప్రాంతాలలో ఇతర నియోజక వర్గ ప్రాంతాల వారిని గుర్తించి పంపించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా రాష్ట్ర, జిల్లా సరిహద్దు చెక్ పోస్టులను మరింత పటిష్టం చేసి ఇతర నియోజక వర్గ వాహనాలు ప్రవేశించకుండా డబ్బు, మద్యం, కానుకలు వంటివి అక్రమ రవాణా జరగకుండా ముమ్మర తనిఖీ చేయాలని, 50 వేల పైగా నగదు, 10 వేల పైగా వస్తువులు రవాణాను గుర్తించి స్వాధీనపరచుకొని కేసులు నమోదు చేయాలని బృందాలకు సూచించారు. ఓటర్లను డబ్బు, మద్యం, బహుమతులతో ప్రలోభపెట్టడం, ఓటర్లను పోలింగ్ స్టేషన్లకు వాహనాలలో తరలించడం శిక్షార్హ నేరమని అటువంటి సంఘటనలపై తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, పోలిసు అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని కలెక్టర్ స్పష్టం చేసారు. ఈ నెల 11, 12 తేదీలలో రాత్రి వేళలో ప్రత్యేక నిఘా పెట్టి సి-విజిల్, 1950 ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణమే పరిష్కరించాలన్నారు. పోలింగ్ స్టేషన్ల సమీప ప్రాంతాలలో ఎటువంటి ప్రచారం చేయరాదని సూచించారు. ఓటు గోప్యత దృష్ట్యా మీడియా ఫోటోలు తీయరాదని కలెక్టర్ కోరారు.

# చెక్ పోస్టులు, నిఘా బృందాల పనితీరును పరిశీలించిన అబ్జర్వర్.



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మే 08**

ఎన్నికలలో ప్రలోభాలను నిలువరించేందుకు వీలుగా నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు డీ.ఎం. నెప్సీ విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాలలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను సందర్శించడంతో పాటు నిఘా బృందాల (ఎస్.ఎస్.టి, ఎఫ్.ఎస్.టి టీం) పనితీరును క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలిస్తున్నారు. పోలింగ్ కు సమయం సమీపించడంతో తనిఖీలను మరింత ముమ్మరం చేశారు. ఇందులో భాగంగానే బుధవారం మాధవనగర్ లో కొనసాగుతున్న చెక్ పోస్టు తనిఖీ చేశారు. ఎన్నికల షెడ్యూలు వెలువడిన నాటి నుండి ఇప్పటివరకు ఎంత మొత్తంలో అక్రమ నగదు, వస్తువులు, మద్యం నిల్వలు స్వాధీనం చేసుకున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

తనిఖీల వివరాలతో కూడిన రికార్డులను పరిశీలించారు. అలాగే ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న నిఘా బృందాల పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలింగ్ కు సమయం సమీపించిన నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు నగదు, మద్యం పంపిణీ జరిగే అవకాశాలు ఉన్నందున గట్టి నిఘా కొనసాగించాలని అబ్జర్వర్ సూచించారు. ముఖ్యంగా సాధారణ సమయాలకంటే ప్రస్తుతం పెద్ద మొత్తంలో మద్యం రవాణా జరిగే అవకాశాలు ఉన్నందున ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. అబ్జర్వర్ వెంట జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ అధికారి పాపయ్య తదితరులు ఉన్నారు.

# బిఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

**దానిని ప్రజలు ఎప్పటికీ మరవరు**

**తలసానితో కలసి పద్మారావు ప్రచారం**

**హైదరాబాద్:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, నిర్వహించిన సంక్షేమ పథకాలు ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని బన్సీలాల్‌పేట్, భోలక్‌పూర్, జీవై.కంపౌండ్, బోయగూడ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ విధానాల పట్ల ప్రజలు ఏవగించుకుంటున్నారని పద్మారావు పేర్కొన్నారు. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ ను గెలిపించాలని ప్రజలు అనుకుంటున్నారని పద్మారావు పేర్కొన్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. కేంద్ర మం త్రి, సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ద్వారా ప్రజలకు కలిగిన లాభమే లేదని విమర్శించారు. ఎంపీగా పద్మారావు విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్‌ను ఎన్నికల్లో గెలిపించాలని ఆ పార్టీ యువ నాయకుడు తీగుళ్ల కిరణ్‌కుమార్‌గౌడ్, బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కందిశైలజ బుధవారం బౌద్ధనగర్ డివిజన్లో పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

పార్టమెంట్‌లో తెలంగాణ బాణి వినిపించాలంటే కారు గుర్తుకు ఓటు వేసి పద్మారావు గౌడ్‌ను గెలిపించాలని

మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. డివిజన్ పరిధిలోని ఆయిల్ డిపో, రైల్వే క్వార్టర్స్ తదితదిర ప్రాంతాల్లో డివిజన్ అధ్యక్షుడు ఎ.ఆర్.కృష్ణ, కార్యకర్తలతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు.



# గజ్వేల్‌లో కెసిఆర్‌కు ఘన స్వాగతం

## మంగళహారతులతో స్వాగతించిన మహిళలు

గజ్వేల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ బస్సు యాత్ర నర్సాపూర్ చేరుకుంది. బుధవారంసాయంత్రం ఎర్రవల్లిలోని తన నివాసం నుంచి బయల్దేరిన కేసీఆర్.. గజ్వేల్ మీదుగా నర్సాపూర్ బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధినేతకు ఘన స్వాగతం లభించింది. గత 15 రోజులోగా దిగ్విజయంగా కొనసాగుతున్న కేసీఆర్ బస్సు యాత్ర తమ పట్టణానికి చేరుకోవడంతో గజ్వేల్ వాసులు ఆనందంతో ఆహ్వానం పలికారు. గజ్వేల్ చేరుకున్న మహానేతకు మంగళహారతులతో స్వాగతం పలికారు. గజ్వేల్ మహిళలు విజయ తిలకం దిద్ది బస్సుయాత్రను నర్సాపూర్ దిశగా సాగనంపారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధినతే కేసీఆర్‌ను చూసేందుకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. వారందరికీ అభివాదం చేస్తూ, నేతలను పలకరిస్తూ నర్సాపూర్‌కు బయల్దేరి వెళ్లారు.

# "కాకతీయ"లో మెరిట్ ప్రోత్సాహకాలు.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:** పదో తరగతిలో ఉత్తమ గ్రేడ్ సాధించిన విద్యార్థులకు కాకతీయ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు భారీ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు కళాశాల ఛైర్పర్సన్ విజయలక్ష్మి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ(ఐఐటి, మెడికల్ కోచింగ్ తో సహా) ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో అడ్మిషన్ పొందేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ఇంటర్ రెండేళ్లు ఉచిత కోచింగ్ ఉంటుందని, కేవలం హాస్టల్ ఫీజు మాత్రమే తీసుకోబడుతుందన్నారు. 9.8 జీపీఏ వచ్చిన విద్యార్థులకు ఫీజులో 60 శాతం రాయితీ, 9.7 జీపీఏ పొందిన వారికి 50 శాతం, 9.5 జీపీఏ విద్యార్థులకు 35 శాతం, అలాగే 8.9 సాధించిన వారికి 25 శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రోత్సా హకం కేవలం కోచింగ్ ఫీజులో మాత్రమే వర్తిస్తుందని, ప్రతి గ్రూపులో ముందు వచ్చిన 30 మందికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9182029525, 9177556270 నంబర్ లలో సంప్రదించాలని కోరారు.

# మోత్కుపల్లి కాదు..ఊసరవెల్లి

## కాంగ్రెస్ నేత శ్రీశైలం ఘాటు వ్యాఖ్యలు

**హైదరాబాద్:** మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు తన ఇంటి పేరును 'ఉసరవెల్లి'గా మార్చుకుంటే పేరుకు తగినట్టు అర్థవంతంగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు డి.శ్రీశైలం వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మోత్కుపల్లిపై శ్రీశైలం నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తీవ్రంగా దుర్భాషలాడుతూ మోత్కుపల్లి ట్విట్టర్‌లో చేసిన పోస్టుపై శ్రీశైలం అభ్యంతరం వ్యక్తం చేశారు. మాదిగల హక్కుల కోసం మాట్లాడుతున్న మోత్కుపల్లి గతంలో మంత్రిగా బాధ్యతలు నిర్వహించినప్పుడు ఏమి న్యాయం చేశారని ప్రశ్నించారు.

ఒక్క మాదిగ కైనా ఆయన మేలు చేశారా..? అని నిలదీశారు. మోత్కుపల్లి సీఎంపై చేసిన ఆరోపణలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మాదిగలు మోత్కుపల్లిని కుల బహిష్కరణ చేస్తారని ఆయన హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలుచేసిన మోత్కుపల్లి నర్సింహులుపై కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా సంఘం వెంటనే చర్యలు తీసుకోవాలని శ్రీశైలం కోరారు.

# ప్రజలు సంతోషంగా ఉంటే బాబు తట్టుకోలేరు

**మంత్రి కారుమూరి నాగేశ్వర రావు విమర్శలు**

**తణుకు:** ప్రజలు సంతోషంగా ఉండటం చంద్రబాబుకి ఇష్టం ఉండదని.. ప్రజలు ఎప్పుడు కష్టాల్లో ఉంటే ఆయన సంతోషంగా ఉంటాడని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. తణుకు పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విద్యాదీవెన, చేయూత పథకాలను ఎన్నికల సంఘం ఆపేసిందని మంత్రి కారుమూరి తెలిపారు. దీని వెనుక చంద్రబాబు హస్తం ఉందని పేర్కొన్నారు. ఫించన్ల పంపిణీలో

అడ్డంకులు సృష్టించిన చంద్రబాబు ఇప్పుడు విద్యాదీవెన, చేయూత పథకాలను అమలు చేయకుండా అడ్డుకున్నారని తీవ్రంగా మండిపడ్డారు.ఈ క్రమంలో చంద్రబాబును ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరని చెప్పారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైసీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

VC NEWS వేగుచుక్క



# బన్నీ కెరీర్‌ను మలుపుతిప్పిన ఆర్య

**ఆర్యతో మొదలు..పుష్పతో 20 ఏళ్లు**

**డైరెక్టర్ సుకుమార్‌కు శుభాకాంక్షల వెల్లువ**

'ఆర్య' చిత్రం వచ్చి 20 సంవత్సరాలు. ఇది సినిమా రిలీజ్ డేట్ మాత్రమే కాదు. నా జీవితాన్ని మార్చిన క్షణమది. ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటాను' అని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు అల్లు అర్జున్, సుకుమార్ దర్శకత్వంలో ఆయన నటించిన చిత్రం 'ఆర్య'. ఆ చిత్రం బన్నీ కెరీర్‌ను మలుపు తిప్పడమే కాదు.. ఎంతోమంది లైఫ్ ఇచ్చింది. లెక్కల మాస్టర్ సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ వన్ సైడ్ లవ్‌స్టోరీ కాన్సెప్ట్‌కి యూత్ అందరూ ఫిదా అయ్యారు. ఈ చిత్రం విడుదలై మంగళవారానికి 20 ఏళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో ఎక్కడ చూసిన ఆర్య చిత్రానికి సంబంధించిన విశేషాలు హల్‌చల్ చేస్తున్నాయి. హీరో అల్లు అర్జున కూడా 'ఆర్య' రోజులను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. స్వీట్ మెమొరీస్ అంటూ ఆ సినిమా షూటింగ్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలను పంచుకున్నారు. ప్రస్తుతం బన్నీ ట్వీట్ వైరల్ అవుతోంది. 'అల్లు అర్జున్ వల్లే 'ఆర్య' సాధ్యమైంది. ఆ ఒక్క సినిమా నా జీవితాన్ని, తన కెరీర్‌ను మార్చేసింది' అని సుకుమార్ పలు సందర్భాల్లో చెప్పిన సంగతి తెలిసిందే! వినోదరంగంలో సినిమాలు టాప్ ప్లేస్‌లో ఉంటాయని ప్రత్యేకించి చెప్పనసరం లేదు. ఇక ప్రేక్షకుల అభిరుచికి, ట్రెండ్‌కు అనుగుణంగా సినిమాలు తీయడం మాత్రం పెద్ద టాస్క్‌లాంటిదే అని చెప్పాలి. అలాంటి టాస్క్‌ను విజయవంతంగా పూర్తి చేస్తూ.. మూవీ లవర్స్ పల్స్ పట్టుకొని వారికి కావాల్సిన వినోదాన్ని అందించే టాలెంటెడ్ డైరెక్టర్లలో టాప్‌లో ఉంటారు సుకుమార్. ప్రేమకథల్లోని కొత్త యాంగిల్‌ను చూపిస్తూ అల్లు అర్జున్ తో తెరకెక్కించిన తొలి సినిమా ఆర్య అను మెహతా, శివబాలాజీ, అల్లు అర్జున్ కాంబోలో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద టాక్ వసూళ్ల వర్షం కురిపించడమే కాదు. వన్‌సైడ్ లవ్వే రా ఎంతో బెటరూ.. అంటూ సుకుమార్ కొత్త కాన్సెప్ట్‌తో సిల్వర్ స్క్రీన్‌పై చూపించిన లవ్ స్టోరీకి తెలుగు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. డైరెక్టర్ కమ్ రైటర్‌గా సుకుమార్ ప్రయాణానికి కూడా నేటితో 20 వసంతాలు అయింది. ఈ సందర్భంగా తమ అభిమాన దర్శకుడి సినిమాలను గుర్తు చేసుకుంటూ.. సుకుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు మూవీ లవర్స్, ఫాలోవర్లు, అభిమానులు.అల్లు అర్జున్‌తో డైరెక్టర్ కమ్ రైటర్‌గా జర్నీ షురూ చేసిన సుకుమార్.. మళ్లీ బన్నీతోనే పుష్ప ఫ్రాంఛైజీ తెరకెక్కిస్తూ గ్లోబల్ స్టార్ డైరెక్టర్ ఇమేజ్‌ను క్రియేట్ చేసుకోవడం విశేషం. పుష్ప ది రైజ్ సినిమాతో గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన లెక్కల మాస్టారు ప్రస్తుతం పుష్ప ది రూల్ తో దండయాత్ర చేసేందుకు రెడీ అవుతున్నాడని తెలిసిందే.

# మన్మధుడు అన్షు మళ్లీ వస్తోంది



నాగార్జున పక్కన 'మన్మధుడు' సినిమాలో చేసిన అన్షు గుర్తున్నారు కదా, ఆమె చాలా సంవత్సరాల విరామం తరువాత ఇప్పుడు ఒక తెలుగు సినిమా ఒప్పుకున్నట్టుగా తెలిసింది. నక్కిన త్రినాధరావు దర్శకత్వంలో సందీప్ కిషన్ కథానాయకుడిగా ప్రారంభం అయిన ఈ సినిమాలో రావు రమేష్ కి జోడీగా అన్షు నటిస్తున్నట్టుగా తెలిసింది. దర్శకుడు నక్కిన త్రినాధరావు, రచయిత బెజవాడ ప్రసన్న కుమార్, సందీప్ కిషన్ కథానాయకుడిగా ఎస్.కె.30 సినిమా కొన్ని రోజుల క్రితం అధికారికంగా ప్రారంభం అయిన సంగతి తెలిసిందే. రాజేష్ దండా నిర్మిస్తున్న ఈ సినిమాలో ఇద్దరు కథానాయికలు వున్నారని తెలిసింది. ఇందులో సందీప్ కిషన్ పక్కన ఒక కథానాయిక కోసం చిత్ర నిర్వాహకులు ఒక కొత్తమ్మాయిని వెతుకుతున్నట్టుగా తెలిసింది. అయితే ఇంకో అమ్మాయి కోసం ముందుగా ఈ చిత్ర నిర్వాహకులు ప్రియమణిని అడిగినట్టుగా తెలిసింది. అయితే ఆమె చాలా బిజీగా ఉండటం వలన ఈ సినిమా కోసం తన తేదీలు కేటాయించలేకపోతున్నట్టుగా తెలిసింది. అయితే ఇప్పుడు చిత్ర నిర్వాహకులు 'మన్మధుడు' లో నాగార్జున పక్కన చేసిన అన్షు కి కథ చెప్పారని, ఆమెకి కథ బాగా నచ్చి ఈ సినిమా చెయ్యడానికి ఒప్పుకుందని ఒక వార్త నడుస్తోంది. అన్షు అప్పట్లో 'మన్మధుడు' తరువాత 'రాఘవేంద్ర' అనే సినిమాలో ప్రభాస్ పక్కన నటించింది. ఇది ప్రభాస్ కి రెండో సినిమా. ఆ తరువాత అన్షు ఇంకో రెండు సినిమాలు మాత్రమే చేసి పరిశ్రమని వీడి వెళ్లిపోయారు. తరువాత పెళ్లి చేసుకొని లండన్ లో

నివాసం వుంటున్నట్టుగా తెలిసిందే. అయితే ఈమధ్యనే మళ్ళీ భారత దేశం వచ్చి నాగార్జునని, పరిశ్రమలో చాలామందిని కలిసింది అన్షు. కొంతమందికి ఇంటర్వ్యూ లు కూడా ఇచ్చింది. అలాగే ఆమె చేసినవి నాలుగు సినిమాలే అయినా, ఆమె ప్రేక్షకుల మదిలో ఉండిపోయింది. ఇప్పుడు చాలా విరామం తరువాత అన్షు ఈ తెలుగు సినిమా చెయ్యడానికి ఒప్పుకున్నారని తెలుస్తోంది. ఆమె రావు రమేష్ పక్కన నటిస్తున్నట్టుగా తెలుస్తోంది. సందీప్ కిషన్ ఈ సినిమాలో కథానాయకుడు కాగా, రావు రమేష్ కూడా ఇంకో ప్రధాన పాత్రలో కనపడతారని తెలుస్తోంది. అన్షు పాత్ర సినిమాలో హైలైట్ అని, ఆమె పాత్రకి ఎంతో ప్రాధాన్యం ఉందని తెలుస్తోంది.

# నిఖిల్ సరసన సంయుక్తా మీనన్

సినిమా సినిమాకు కొత్తదనంతో కూడిన కథలను ఎంపిక చేసుకుంటూ హిట్స్‌ను ఖాతాలో వేసుకుంటున్నాడు టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ. ఈ యంగ్ యాక్టర్ తొలిసారి నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం స్వయంభు. ఈ మూవీలో మలయాళ బ్యూటీ సంయుక్తామీనన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా చాలా రోజుల తర్వాత షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా గురించి ఆసక్తికర అప్‌డేట్ అందించింది నిఖిల్ అండ్ మేకర్స్ టీం. స్వయంభు టీం.. ఒక పురాతన కాలం బ్యాక్‌డ్రాప్‌లో సాగే యుద్ధ ఎపిసోడ్‌ను భారీ స్థాయిలో చిత్రీకరిస్తోంది. 12 రోజులపాటు జరుగనున్న ఈ షెడ్యూల్‌ను రూ.8 కోట్ల భారీ బ్జడెట్‌తో షూట్ చేస్తున్నారు. నిఖిల్ యాక్షన్, స్టంట్స్‌తో సాగే ఈ సీక్వెన్స్ అద్భుతంగా ఉండబోతుందని మేకర్స్ ట్వీట్ చేశారు. తాజా అప్‌డేట్‌తో సినిమా స్టన్నింగ్‌గా గూస్‌బంప్స్ తెప్పించేలా ఉండబోతుందని అర్థమవుతోంది. స్వయంభు చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ నిఖిల్ కెరీర్‌లో అత్యంత భారీ బ్జడెట్‌తో వస్తోంది. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రానికి మనోజ్ పరమహంస



సినిమాటోగ్రాఫర్.. కాగా కేజీఎఫ్ ఫేం రవి బస్రూర్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సంగీతం అందిస్తున్నాడు. స్వయంభులో నిఖిల్ యుద్ధ వీరుడిగా ఇదివరకెన్నడూ కనిపించని సర్‌ప్రైజింగ్ లుక్‌లో మెరువబోతున్నాడు.



# ప్రతిష్టాత్మకంగా థగ్ లైఫ్ మూవీ



కమల్‌హాసన్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. వీటిలో ఒకటి 'థగ్ లైఫ్' మణిరత్నం డైరెక్షన్‌లో వస్తోంది. థగ్ లైఫ్‌లో ఐశ్వర్యలక్ష్మి, త్రిష, ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తుండగా.. గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, దుల్కర్ సల్మాన్, జయం రవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ ఢిల్లీలోని సంకట్ మోచన్ హనుమాన్ మందిర్‌లో కొనసాగుతున్నట్టు ఇప్పటికే ఓ అప్‌డేట్ నెట్టింట హల్ చల్ చేస్తోంది. కమల్ హాసన్, శింబు అండ్ టీంపై వచ్చే సీన్లను చిత్రీకరిస్తున్నారు

లొకేషన్‌లో కమల్ హాసన్ కోరమీసంతో ఉన్న లుక్‌తో పాటు శింబు స్టైలిష్ లుక్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. కాగా థగ్‌లైఫ్ టీం మరో ఆసక్తికర అప్‌డేట్‌తో రేపు ప్రేక్షకుల ముందుకు రానుంది. కొత్త ఆరంభ సమయం.. కొత్త థగ్‌కు స్వాగతం పలికే సమయం.. రేపు ఉదయం 10 గంటలకు అప్‌డేట్ రానుందంటూ ఓ వీడియో షేర్ చేశారు మేకర్స్. ఇప్పుడీ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. థగ్ లైఫ్ టీంతో డిజైన్ చేసిన వీడియో ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ మూవీకి ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీని కమల్ హాసన్–ఉదయనిధి స్టాలిన్ సమర్పణలో రాజ్‌కమల్ ఫిలిం ఇంటర్నేషనల్, రెడ్ జియాంట్ మూవీస్, మద్రాస్ టాకీస్ బ్యానర్లపై కమల్ హాసన్–ఆర్ మహేంద్రన్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.